క్లుప్తంగా

జీలుగ విత్తనాలు పంపిణీ



రైతుకు అందిస్తున్న ఏవో, ఏఈవోలు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మండల రైతులకు ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న జీలుగ విత్తనాల పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది. మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో జీలుగ విత్తనాలను రైతులకు మండల వ్యవసాయ అధికారిణి డి.వందన పంపిణీ చేశారు. 30కిలోల జీలుగ విత్తనాల బస్తాకు పూర్తి ధర రూ.2,790 ఉండగా ప్రభుత్వం రూ.1,674సబ్సిడీని కల్పించింది. మిగితా రూ.1,116 చెల్లించి అవసరమైన రైతులు పచ్చిరొట్ట విత్తనాలను తీసుకెళ్లాలని వ్యవసాయాధికారిణి తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో కె.నాగదీప్తి, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈవో కె.వెంకటస్వామి, రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

దండేపల్లి: దండేపల్లి కాంప్లెక్స్ పరిధిలోని పలు ప్రాథమిక పాఠశాలలను కాంప్లెక్స్ హెచ్ఎం శంకర్‌గౌడ్ సోమవారం సందర్శించారు. పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులు పరిశీలించారు. యూనిఫాం స్టిచ్చింగ్ సెంటర్లకు వెళ్లి యూనిఫాం కుడుతున్న తీరును పరిశీలించారు. పాఠశాలలు ప్రారంభం నాటికి యూనిఫాం అందించాలని ఐకేపీ మహిళలకు సూచించారు. ఉపాధ్యాయుడు రాజేశ్వర్‌రావు, సీఆర్పీ నర్సయ్య ఉన్నారు.

ఎక్కాహం ప్రారంభం

చెన్నూర్‌రూరల్: మండలంలోని అక్కెపల్లి గ్రామంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం ఎక్కాహం(భజన) కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భజన ప్రారంభించారు. ఈ కార్యక్రమం మంగళవారంతో ముగుస్తుంది. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

హనుమాన్ భక్తుల శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

రామకృష్ణాపూర్: పట్టణంలోని విజయగణపతి దేవాలయం నుంచి బీజోన్ పుర వీధుల గుండా సోమవారం రాత్రి హనుమాన్ మాల ధరించిన స్వాములు శోభాయాత్ర నిర్వహించారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన శోభాయాత్రలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు సతీష్‌శర్మ, గురుస్వామి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం అన్‌లోడ్ చేసుకోవాలి

లక్సెట్టిపేట: ధాన్యాన్ని రైస్ మిల్లర్లు వెంటనే అన్‌లోడ్ చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు పింగిళి రమేష్ అన్నారు. మండల కేంద్రంలోని ఆర్ఆర్ ఫంక్షన్ హాల్లో లక్సెట్టిపేట, దండేపల్లి మండలాల కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మిల్లర్లు ధాన్యం అన్‌లోడ్ చేసుకోకపోతే వారిపై చర్యలు తీసుకోవాలని, రైతులకిచ్చిన హామీ ప్రకారం కొనుగోలు కేంద్రాల్లో తూకంపై మోసం జరిగితే వెంటనే దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు త్రిమూర్తి, అశోక్, ఎండీ ఆరీఫ్, దేవేందర్ రెడ్డి, షాహిద్ అలీ, నవాబ్, రమేష్ పాల్గొన్నారు.

సామగ్రి వితరణ

దండేపల్లి: మండలంలోని రెబ్బనపల్లి ఆరోగ్య మందిర్‌కు వాషింగ్టన్ తెలుగు అసోసియేషన్, హోప్స్ అండ్ స్మైల్ వారు ఫర్నీచర్‌తో పాటు మెడికల్ సామగ్రి, రిఫ్రిజిరేటర్, ఇన్వెర్టర్, కంప్యూటర్‌ను సోమవారం అందజేశారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి సతీష్, నవజ్యోతి యూత్ సభ్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

స్నేహితునికి చేయూత

జన్నారం: మండలంలోని పొనకల్ రామాలయం వీధిలో గల నగూరి శ్రీనివాస్ కొన్ని రోజులుగా అనారోగ్యం బారినపడ్డాడు. అతడి కూతురు పై చదువుల కోసం డబ్బులు లేక ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న 1993–94 సంవత్సరానికి చెందిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతికి చెందిన తోటి స్నేహితులు చేయిచేయి కలిపారు. రూ.26,200పోగు చేసి సోమవారం శ్రీనివాస్‌కు అందజేశారు.

ఆర్థికసాయం

రామకృష్ణాపూర్: పట్టణంలోని ఆర్‌కే4 గడ్డ ప్రాంతానికి చెందిన గుజ్జ సుధాకర్ పక్షవాతం వచ్చి బాధపడుతుండగా అతడి కుటుంబానికి తమవంతు సాయంగా స్థానిక పద్మశాలీ కులస్తులు సోమవారం రూ.28,626 అందజేశారు.

సేంద్రియం కనుమరుగు..!

- పశువుల సంఖ్య తగ్గడంతో ఎరువుల కొరత
- రసాయనిక ఎరువుల వాడకంతో నేలలు నిస్సారం



సేంద్రియ ఎరువును కొనుగోలు చేసి లారీలో లోడ్ చేస్తున్న దృశ్యం

దండేపల్లి: గతంలో వేసవి వస్తే చాలు అన్నదాతలు పశువుల ఎరువును పొలాలు, చేలకు తరలించే పనుల్లో నిమగ్నం అయ్యేవారు. ఏడాదిపాటు ఇళ్లవద్ద నిల్వచేసిన పశువుల ఎరువును పొలాల్లో వేసి నేలను బలవంతం చేసేది. ఇప్పుడు ఆ పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. సేంద్రియ ఎరువుకు బదులు రసాయనిక ఎరువులతోనే పంటలు పండిస్తున్నారు. దీంతో పెట్టుబడులు పెరగడంతో అన్నదాతలపై ఆర్థిక బారం పడుతోంది. రైతుల ఇళ్లలో పశువుల సంఖ్య తగ్గడంతో పశువుల ఎరువు కొరత ఏర్పడింది. గతంలో వ్యవసాయానికి అరక కట్టి నాగలి దున్నేందుకు ఎద్దులు వినియోగించేవారు, ప్రతీ రైతు ఇంట పాడి పశువులు కూడా ఉండేవి. దీంతో పశువుల పేడను ఒక చోట కుప్పగా వేయడంతో అది సేంద్రియ ఎరువుగా తయారయ్యేది. ఆ ఎరువును పొలాలకు వేసేవారు. వ్యవసాయంలో యంత్రాల వినియోగం పెరగడంతో, రైతుల ఇంటా పశువుల సంఖ్య తగ్గిపోయింది. ప్రస్తుతం పశువుల ఎరువును కూడా కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొన్ని చోట్ల కనీసం బయట కొందామన్నా పశువుల ఎరువు దొరకడం లేదు.

నిస్సారం అవుతున్న నేలలు..

గతంలో రైతుల ఇళ్లలో పశువుల సంఖ్య అధికంగా ఉండేది. ఒక్కో రైతు ఇంట్లో ఐదు నుంచి పది వరకు పశువులు ఉండేవి. పెద్ద రైతుల ఇంట్లో అయితే పశువుల సంఖ్య మరింత ఎక్కువగా ఉండేది. ప్రస్తుత పరిస్థితుల్లో వాటిని సంరక్షించే పరిస్థితి లేదు. దీనికి తోడు సాగునీటి వనరులు పెరగడంతో బీడుభూములు కనుమరుగయ్యాయి. పశువులు మేసే జాగ లేకపోవడంతో పశువుల సంఖ్య కూడా క్రమక్రమంగా తగ్గుతోంది. పదేళ్ల క్రితం ఉన్న పశువుల సంఖ్య, ఇప్పుడు సగానికి తగ్గిందనే చెప్పొచ్చు. చాలామంది రైతులు వ్యవసాయంలో యంత్రాలు అందుబాటులోకి రాక ముందు అరక దున్నేందుకు, బండ్లను తోలేందుకు ఎడ్లను వినియోగించేది. ఇప్పుడు ట్రాక్టర్లు అందుబాటులోకి రావడంతో ఎడ్లు, ఎడ్ల బండ్లు కనుమరుగయ్యాయి. కేవలం కొంతమంది రైతులు మాత్రమే ఇంటి అవసరాల మట్టుకు పాడి పశువులను పాల అవసరాల కోసం ఉంచుకుంటున్నారు. చాలా మంది రైతులు పొలను సైతం కొనుగోలు చేస్తున్నారు. పశువుల సంఖ్య తగ్గడంతో సేంద్రియ ఎరువు కొరత ఏర్పడింది. దీంతో సేంద్రియ ఎరువు స్థానంలో రసాయనిక ఎరువుల వాడకం పెరిగి సారవంతం అయిన నేలలు నిస్సారం అవుతున్నాయి.

గొర్రెల మందలతో..

రైతుల ఇళ్లలో సేంద్రియ ఎరువు లేకపోవడంతో, రసాయనిక ఎరువుల వినియోగం అధికంగా పెరిగింది. దీంతో చీడపీడలు పెరిగి భూసారం నిస్సారంగా మారింది. పశువుల ఎరువు కొరతతో, పశువుల ఎరువుకు డిమాండ్ పెరిగింది. కొంతమంది రైతులు పొలాలకు సేంద్రియ ఎరువును అందించేందుకు వేసవిలో పొలాల్లో వారం, పది రోజుల పాటు గొర్రెల మందలు పెట్టించి సేంద్రియ ఎరువును అందిస్తున్నారు.

పైపుల లీకేజీకే ఇంజనీర్లు

- ఇతర అభివృద్ధి పనులపై పట్టింపు కరువు
- కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండని వైనం



మంచిర్యాల మున్సిపాలిటీ

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ విభాగంలోని అధికారులు రోడ్లు, డ్రెయినేజీ పనులతో పాటు, ఇతర అభివృద్ధి పనులు, తాగునీటి సరఫరాను చేపట్టాల్సి ఉంటుంది. నెల రోజులుగా మున్సిపల్ ఇంజనీరింగ్‌లోని ముగ్గురు అధికారులు కార్యాలయంలో అందుబాటులో ఉండకపోవడంతో, ఏదైనా పని నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపాలిటీలో డివిజనల్ ఇంజనీర్, ఏఈ, టెక్నికల్ ఆఫీసర్(ఏఈ)లు ముగ్గురు మాత్రమే పనిచేస్తుండగా, టెక్నికల్ ఆఫీసర్‌కు మంచిర్యాలతో పాటు, నస్పూర్ మున్సిపాలిటీకి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. జిల్లా కేంద్రం కావడం, గ్రేడ్ 1 మున్సిపాలిటీ కావడంతో, ఇక్కడ మరో ఇద్దరు ఇంజనీర్లు అవసరం ఉంటుంది. ఉన్న ముగ్గురిలో ఒకరికి రెండు మున్సిపాలిటీలను అప్పగించడం, మిగిలిన ఇద్దరు అధికారులు మున్సిపల్ కార్యాలయానికి రాకుండా, వాటర్ ట్యాంకు వద్దనే ఉండి విధులు నిర్వర్తిస్తున్నారని, వారి అనుకూలతను బట్టి మున్సిపాలిటీకి వచ్చి వెళ్లిపోతున్నట్లు ప్రజల నుంచి ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. తాగునీటి సరఫరాలో ఇబ్బందులు రాకుండా ఉండేందుకు వాటర్ ట్యాంకు వద్దనే ఉండాల్సి వస్తుందని అధికారులు చెబుతున్నా, తాగునీటితో పాటు, ఇతర అభివృద్ధి పనులకు సంబంధించిన పనులను చూడాల్సింది ఇంజనీరింగ్ విభాగమే. దీంతో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండేలా కార్యాలయంలో పనివేళలను నిర్ణయించి, పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

భగవద్గీత పుస్తకాల పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న సభ్యులు

లక్సెట్టిపేట: మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో త్రైత సిద్ధాంతం–ప్రబోధ సేవా సమితి ఇందు జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం చేస్తూ పుస్తకాలు పంపిణీ చేశారు. త్రిమత ఏకైక గురువు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు గ్రహీత శ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాలను పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తూ పుస్తకాలు పంపిణీ చేశారు. సభ్యులు రాజు, రవళి, అనుతేజ్, సాహిత్, సంధ్యారాణి, సునీత, రిషి, రిషిత, వేణుగోపాల్, అద్వితీయ, రావణ్ పాల్గొన్నారు.

టైలరింగ్ కేంద్రం సందర్శన



భీమారం: తయారీని పరిశీలిస్తున్న ఎంపీడీవో

భీమారం: ప్రభుత్వ పాఠశాలల పునఃప్రారంభానికి ముందే విద్యార్థులకు అందించే ఏకరూప దుస్తులు సిద్ధం చేయాలని ఎంపీడీవో రాధారాథోడ్ ఐకేపీ సిబ్బందిని ఆదేశించారు. మండల కేంద్రంలో ఐకేపీ ద్వారా ఏర్పాటు చేసిన టైలరింగ్ కేంద్రాన్ని సోమవారం సందర్శించారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన దుస్తులు తయారు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. కుట్టు వేసే సమయంలో సిబ్బంది పరిశీలించాలని ఆదేశించారు. ఆమె వెంట ఏపీఎం త్రియంబక్ ఉన్నారు.

పాఠశాలలకు దుస్తులు అందజేత

జన్నారం: వచ్చే విద్యాసంవత్సరం కోసం ప్రభుత్వం మహిళా సంఘాల ద్వారా కుట్టించిన విద్యార్థుల ఏక రూప దుస్తులు పూర్తి కావడంతో సోమవారం మహిళా సమాఖ్య కార్యాలయంలో 8 పాఠశాలలకు ఎంపీడీవో శశికళ, ఎంఈవో విజయ్‌కుమార్ అందజేశారు. పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అందరికీ దుస్తులు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం బుచ్చన్న, సిబ్బంది పాల్గొన్నారు.

'వ్యక్తిగత ఆరోపణలు చేస్తే సహించేదిలేదు'



మాట్లాడుతున్న ఐక్య దళిత సంఘాల నాయకులు

చెన్నూర్: పెద్దపల్లి బీజేపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్‌పై వ్యక్తిగత ఆరోపణలు చేస్తే సహించేదిలేదని బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసిపేట శివాజీ, నేతకాని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్కూరి రాజమల్లు, ఎమ్మార్పీఎస్ పెద్దపల్లి ఇన్‌చార్జి శరత్‌లు అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఐక్య దళిత సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రైతుల సమస్యలు పట్టించుకోకుండా ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, కొడుకు వంశీకృష్ణలు విదేశీ పర్యటనలకు వెళ్లారని ఆరోపించారు. కల్లాల వద్ద రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిసి బీజేపీ అభ్యర్థి కొనుగోలు కేంద్రాలు సందర్శించి రైతులకు న్యాయం చేయాలని కోరిన గోమాస శ్రీనివాస్‌పై కాంగ్రెస్ నాయకులు అర్థంపర్థం లేని ఆరోపణలు చేయడం సబబు కాదన్నారు. కాంగ్రెస్ నాయకులు రైతులకు మేలు చేస్తే మేము ఎందుకు వస్తామన్నారు. కొందరు స్థానిక నాయకులు పెత్తందారి తనం చేయాలన్న ఉద్దేశంతో ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. పద్ధతి మార్చుకోకపోతే తగిన బుద్ధి చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో కొటారి వెంకటేశ్, మంత్రి రామయ్య, రాజ్‌కుమార్, దుర్గం నర్సింహులు, సంతోశ్, మహేశ్‌లు పాల్గొన్నారు.

కిరాణషాపుల్లో తనిఖీలు



తనిఖీ చేస్తున్న పోలీసులు

భీమారం: ప్రభుత్వం గుట్కాలు నిషేధించిన నేపథ్యంలో సోమవారం మండల కేంద్రంలోని కిరాణాషాపుల్లో ఏఎస్సై భూమన్న నేతృత్వంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. అన్ని కిరాణ షాపుల్లో పోలీసులు గుట్కాల కోసం గాలించారు. ఎక్కడా గుట్కాలు లభించలేదని ఏఎస్సై తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ మాచర్ల, కిరణ్ పాల్గొన్నారు.

ఇరుకు వంతెనతో ఇబ్బందులు



జోడువాగులపై ఇరుకువంతెన

భీమారం: మంచిర్యాల–చెన్నూర్ జాతీయరహదారిపై భీమారం సమీపంలోని జోడువాగులపై గల ఇరుకు వంతెనతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దాదాపు 75ఏళ్ల క్రితం సింగిల్ రోడ్డు ఏర్పాటు సమయంలో నిర్మించిన వంతెన.. వాహనాల రద్దీ కారణంగా ఇప్పుడు సరిపోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎప్పుడూ వాహనాల రద్దీతో ఉండే రహదారిని, రెండు వరసల రహదారిగా నేషనల్ హైవేస్ అభివృద్ధి చేసి కేవలం జోడువాగులవద్ద రోడ్డును మాత్రం రెండువరసల రహదారితో పాటు వంతెనని నిర్మించలేదని వాపోయారు. దీంతో వంతెన వద్ద రెండు వాహనాలు వస్తే ఇబ్బందిగా మారింది. రానున్న వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా ఉండే ప్రమాదం ఉందని ప్రజలు పేర్కొన్నారు. ఇరుకు వంతెన వద్ద వాహనాలు దిగబడి పోతున్నాయని తెలిపారు. అధికారులు చర్యలు తీసుకొని జోడువాగుల వద్ద రెండువరసల వంతెన నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

సమాచారం

బెల్లంపల్లిలో 30న వాహనాల వేలం

బెల్లంపల్లి: ఎక్సైజ్ నేరాలలో పట్టుబడి జప్తు చేసిన వాహనాలను ఈ నెల 30న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు బెల్లంపల్లి ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ జె.ఇంద్ర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఎక్సైజ్ అధికారి ఆదేశాల మేరకు బెల్లంపల్లి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పట్టుబడిన 11వాహనాలకు వేలం వేయనున్నట్లు తెలిపారు. ఉదయం 11గంటలకు ఎక్సైజ్ కార్యాలయం ఆవరణలో బహిరంగ వేలం నిర్వహిస్తామని తెలిపారు. వేలంలో పాల్గొనదలిచిన వ్యక్తులు వాహన విలువలో 50శాతం ఈఎండీ ముందస్తుగా చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వాహనాలను పరిశీలించడానికి, ఇతర సమాచారం కోసం ఎక్సైజ్ కార్యాలయంలో పని వేళల్లో సంప్రదించాలని సీఐ తెలిపారు.

చెన్నూర్‌లో 29న...

చెన్నూర్: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో పట్టుబడిన వాహనాలకు ఈ నె ల 29న వేలం ఉంటుందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ చెన్నూర్ ఇన్‌స్పెక్టర్ హరి సో మవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరు నడిచే వాహనాలు, తొమ్మిది స్క్రాబ్ వాహనాలు ఉన్నాయని ఆసక్తి గల వారు ఆ రోజు ఉదయం 11గంటలకు కార్యాలయంలో హాజరుకావాలని తెలిపారు.

నేడు హనుమత్ యజ్ఞం

శ్రీరాంపూర్: నస్పూర్ కాలనీలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం శ్రీరామ సహిత హనుమత్ యజ్ఞం జరుగనుంది. జూన్ 1న జరిగే హనుమాన్ జయంతిని పురస్కరించుకొని హనుమాన్ సేవా సమితి ఆధ్వర్యంలో పెద్దయెత్తున యజ్ఞం నిర్వహిస్తున్నారు. దీనికోసం ఆలయ కమిటీ విస్తృత ఏర్పాట్లు చేసింది. ఆలయ పురోహితులు ఎం. ఫణికుమార్‌శర్మ ఆధ్వర్యంలో ఈ యజ్ఞం జరుగనుంది. ఉదయం 10గంటలకు యజ్ఞం ప్రారంభమవుతుందని నిర్వాహకులు తెలిపారు. దీనికోసం ఆంజనేయ స్వామి మాలలు ధరించిన స్వాములు ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేశా రు. మధ్యాహ్నం స్వాములకు భిక్షతో పాటు యజ్ఞానికి వచ్చేసిన పుర ప్రజలకు అన్నదానం నిర్వహించనున్నారు. పెద్దఎత్తున స్వాములు, భక్తులు ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేసి స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని తెలిపారు.

7న కళాయాత్ర ముగింపు సభ



పార్‌పల్లిలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న గ్రామస్తులు

కోటపల్లి: లైవ్ డ్రాయింగ్ యొక్క ప్రాముఖ్యతను నేటి తరానికి తెలియజేసే లక్ష్యంతో చెన్నూర్ వాసి ఎల్పుల పోచం చేపట్టిన కళాయాత్ర కాశ్మీర్ టు కన్యాకుమారి యాత్ర పోస్టర్లను సోమవారం పార్‌పల్లి గ్రామంలో విడుదల చేశారు. కన్యాకుమారిలో కళాయాత్ర ముగింపు సభను ఏర్పాటు చేయనున్నట్లు పోచం తెలిపారు. ఈ కార్యక్రమానికి వివిధ రాష్ట్రాల కళాకారులు, ప్రతినిధులు హాజరుకానున్నారు. కళాయాత్ర 2017లో మొదలై 2410రోజుల్లో 28రాష్ట్రాలు, 4 కేంద్రపాలిత ప్రాంతాల్లో 30,700 కి.మీ తో జూన్ 7న పూర్తి కానుంది. అదేరోజు కన్యాకుమారిలో ముగింపు సభ ఏర్పాటు చేయనున్నారు. ఎంతో ప్రతిష్టాత్మకమైన ఈ యాత్ర ప్రపంచ దృష్టిని ఆకర్షించి లండన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు తదితర అవార్డులను సొంతం చేసుకుంది. అదే విధంగా లింకాబుక్ ఆఫ్‌రికార్డు, గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డు వారు ఇప్పటికే సంప్రదించినట్లు ఆర్టిస్టు పోచం తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ముగింపు సభకు హాజరు కావాల్సిందిగా ఆహ్వానించారు.

ఘనంగా రమాబాయి వర్ధంతి



లక్సెట్టిపేట: నివాళులర్పిస్తున్న నాయకులు

మందమర్రిరూరల్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సతీమణి రమాబాయి వర్ధంతిని పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. రమాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రాంబాబు, శంకర్, నరేష్, వీరస్వామి, ఎల్లారం, శ్రీనివాస్, రాజేశం, రాజు తదితరులు ఉన్నారు.

లక్సెట్టిపేట: అంబేద్కర్ సతీమణి రమాబాయి వర్ధంతి దినోత్సవాన్ని మండలంలోని అంబేద్కర్ సంఘం నాయకుల ఆధ్వర్యంలో స్థానిక భవనంలో సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఆమె ఫొటోకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు రాంధాస్, మండల నాయకులు లింగన్న, చాతరాజు రాజన్న, దొంత నర్సయ్య, నాయకులు పాల్గొన్నారు.

విత్తన కొనుగోళ్లలో జాగ్రత్తలు తీసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

మంచిర్యాలరూరల్(హాజీపూర్)/లక్సెట్టిపేట/నెన్నెల/తాండూర్/చెన్నూర్‌రూరల్/దండేపల్లి/వేమనపల్లి: పంటల సమయం అయినందునా రైతులు విత్తన కొనుగోళ్లలో తగిన జాగ్రత్తలు తీసుకుని అధిక దిగుబడి సాధించాలని వ్యవసాయశాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ క్షేత్రాల్లో రైతులతో నేరుగా కలిసి విత్తన కొనుగోళ్లపై వివరించారు. విత్తన డీలర్ల వద్ద తీసుకునే విత్తనాలకు సంబంధించి కంపెనీ పేరు, విత్తన రకం, లాట్ నంబర్, ఫోన్ నంబర్ తదితర వివరాలతో రశీదు పొందాలని, విడి విత్తనాలు ఎప్పుడూ కొనవద్దని, విత్తనాల చెల్లుబాటు తేదీ చూసుకోవాలని సూచించారు. లూజు విత్తనాలు అమ్మినట్లు తెలిస్తే వ్యవసాయాధికారులకు సమాచారం ఇవ్వాలని, ముఖ్యంగా వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. హాజీపూర్, లక్సెట్టిపేట, నెన్నెల, తాండూర్, చెన్నూర్, వేమనపల్లి మండలాల పరిధిలోని గ్రామాల్లో సోమవారం వ్యవసాయాధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా మండలాల పరిధిలోని గ్రామాల్లో చెన్నూర్ మండలంలో జిల్లా వ్యవసాయాధికారి సురేఖ, నెన్నెలలో భీమిని డివిజన్ ఏడీఏ ఇంతియాజ్, ఏఈఓలు రాంచందర్, మౌనిక, హాజీపూర్‌లో ఏఈవోలు శ్రీనిక, కనకరాజు, మౌనిక, లక్సెట్టిపేటలో మండల వ్యవసాయాధికారి చెల్లా ప్రభాకర్ రెడ్డి, తాండూర్‌లో మండల వ్యవసాయ శాఖ అధికారి కిరణ్మయి, వ్యవసాయశాఖ విస్తరణ అధికారులు పుష్పలత, ధనలక్ష్మి, వేమనపల్లిలో మండల వ్యవసాయాధికారి వీరన్న, ఏఈవోలు రుక్సార్ సుల్తానా, సంతోష్‌కుమార్, దండేపల్లిలో ఏవో అంజిత్‌కుమార్, ఏఈవో సుమన్ తదితరులు రైతులకు అవగాహన కల్పించారు.

విద్యార్థులు, ఉపాధ్యాయులకు కలెక్టర్ అభినందన



ఉపాధ్యాయులను అభినందిస్తున్న జిల్లా కలెక్టర్

జన్నారం: పదో తరగతి ఫలితాలలో పది జీపీఏ పాయింట్లు సాధించిన రాథోడ్ ఈశ్వర్ ను జన్నారం మండలం కిష్టాపూర్ ఉన్నత పాఠశాల హెచ్ఎం రాజన్నతో పాటు, ఉపాధ్యాయులు, విద్యార్థులను సోమవారం జిల్లా కలెక్టర్ బాదవత్ సంతోష్, జిల్లా విద్యాధికారి యాదయ్య కలెక్టర్ చాంబర్‌లో అభినందించారు. విద్యార్థులను శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సన్మానించారు. జాతీయ ఉపకార వేతనాల పరీక్షలలో 11 మంది విద్యార్థులు ఎంపికై జిల్లాలో రెండో స్థానంలో నిలిచినందుకు గాను ఇందుకు కృషి చేసిన ఉపాధ్యాయులను అభినందించారు. ప్రేరణ కార్యక్రమంలో పరీక్ష రాసి గుజరాత్‌లో జరిగే ప్రధాన మంత్రి పాల్గొని ప్రసంగించే ఆల్ ఇండియా సెమినార్‌లో పాల్గొనే అవకాశం రామటెంకి విష్ణువర్ధన్‌కు రావడంపై, సీఓఈ హైదరాబాద్‌లో సీటు రావడం వల్ల ఆ విద్యార్థిని కూడా కలెక్టర్, డీఈవోలు అభినందించారు. కిష్టాపూర్ పాఠశాలలో గణితం ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న జాడి మురళి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం అందించే రూ.10వేల నగదును డీఈవో చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రాజన్న, ఉపాధ్యాయులు రఘుపతిరెడ్డి, దాముక కమలాకర్, రాజన్న, బుచ్చిలింగయ్య, అరుణ, మణెమ్మ, నరహరి శర్మ, వేణుగోపాల్, కాంతయ్య, సీఆర్పీ శేఖర్ పాల్గొన్నారు.

పరామర్శ

వేమనపల్లి: మండలంలోని కేతన్‌పల్లికి చెందిన కాంగ్రెస్ నాయకుడు హన్మంతు ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురి కాగా, తీవ్ర గాయాలతో నడవలేని స్థితిలో ఉన్నారు. దీంతో ఎంపీటీసీ సంతోష్ కుమార్ సోమవారం అతడి ఇంటికి వెళ్లి పరామర్శించాడు.